

గ్రామాల్లో స్వచ్ఛతకు పెద్దపీట

మర్పల్లి, ఫిబ్రవరి 8: గ్రామాల్లో స్వచ్ఛతకు పెద్దపీట వేయనున్నట్లు ప్రత్యేకాధికారి గణేశ్ అన్నారు. తుమ్మలపల్లి, కొత్తపూరం పంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అధికారులు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి రంగారెడ్డి రాజకీయాల్లో భారీ కుదుపునకు తెరలేచింది. బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, తన సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం రాజకీయ వర్గాల్లో కలకలం లేపింది. వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న విషయం తెలియడంతో బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఈ పరిణామాలు బీఆర్‌ఎస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బగానే పరిగణించాలని రాజకీయ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కాంగ్రెస్ గూటికి పట్నం దంపతులు

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి కుటుంబం

- ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్
- చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థినిగా సునీతారెడ్డి!
- మహేందర్ బాటలో మరికొందరు ఎమ్మెల్యేలు!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంచి పట్టున్న మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడం బీఆర్‌ఎస్‌కు పెద్ద దెబ్బేనని చెప్పాలి. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు బీఆర్‌ఎస్ తాండూరు టికెట్ నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్ వైపు చూశారు. పలు దఫాలు ఆయన పార్టీ ముఖ్య నేతలతో చర్చలు కూడా జరిపారు. అయితే, ఇది గమనించిన బీఆర్‌ఎస్ నాయకత్వం ఎన్నికలకు ముందు ఆయనకు మంత్రి పదవి ఇచ్చి బుజ్జగించింది. దీంతో ఆయన పార్టీ మారే యోచనను విరమించుకున్నారు. కానీ మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు కానీ, ఆయన ముఖ్య అనుచరులకు కానీ మహేందర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం నచ్చలేదు. ఈ కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు మహేందర్‌రెడ్డితో వారు కలిసి రాలేదు. ముఖ్యంగా ఆయన భార్య సునీతారెడ్డి కూడా ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. మహేందర్‌రెడ్డిని ఎలాగైనా కాంగ్రెస్‌లోకి రప్పించాలని రేవంత్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. ఎన్నికల తేదీకి వారం రోజుల ముందు కూడా ఆయనకు భారీ ఆఫర్ ఇచ్చారు. కానీ, అప్పటి పరిస్థితుల్లో ఆయన బీఆర్‌ఎస్‌లోనే కొనసాగాలని నిర్ణయించారు. ఎన్నికల ఫలితాల తరువాత కూడా మహేందర్‌రెడ్డిని రప్పించేందుకు కాంగ్రెస్ నేతలు పలుమార్లు చర్చలు జరిపారు. చివరకు మహేందర్‌రెడ్డి ఆయన భార్య సునీతారెడ్డి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించారు. ఇదిలా ఉంటే మహేందర్‌రెడ్డి కుటుంబం చేరిక వెనుక బలమైన కారణమే ఉంది. మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి చేవెళ్ల పార్లమెంట్ సీటు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ మేరకు వారి కుటుంబానికి స్పష్టమైన హామీ కూడా లభించడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి బలమైన అభ్యర్థులు బరిలోకి దిగుతుండడంతో అధికార కాంగ్రెస్ కూడా ఆర్థిక, అంగబలం ఉన్న వారిని పోటీలో దింపే యత్నం చేస్తోంది. మహేందర్‌రెడ్డి సతీమణి సునీతారెడ్డి గతంలో ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా పదేళ్ల పాటు పనిచేయడంతో ఆమెకు జిల్లా అంతటా సన్నిహిత సంబంధాలున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ సునీతారెడ్డిని బరిలో దింపాలని నిర్ణయించినట్లు సమాచారం. మహేందర్‌రెడ్డి కుటుంబంతో పాటు ఆయన అనుచరులు ఈ నెల 11వ తేదీలోగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

మల్కాజిగిరిపై తర్జనభర్జన

ఇదిలా ఉంటే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి కూడా కాంగ్రెస్‌లో పోటీ ఉన్నప్పటికీ ఆర్థికంగా బలంగా ఉన్న వారి కోసం కాంగ్రెస్ ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. మల్కాజిగిరి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన మైనంపల్లి హన్మంతరావు కూడా పోటీకి సై అంటున్నట్లు సమాచారం. అలాగే సీనియర్ నేత కుసుమ కుమార్‌తో పాటు హరివర్ధన్‌రెడ్డి తదితరులు ఆసక్తిగా ఉన్నారు. అయితే ప్రధానంగా బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పేరు కూడా కొద్ది రోజులుగా వినిపిస్తోంది. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇప్పటి వరకు ఎవరికీ హామీ ఇవ్వలేదు. ఇపుడు చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో సీఎం మదిలో ఏముందో ఎవరికీ తెలియడం లేదు.

ఎమ్మెల్యేలపై గురి!

పార్లమెంట్ ఎన్నికలకు ముందు వలసలకు గేట్లు తెరవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా నగర శివార్లలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పూర్తిగా తమ వైపునకు తిప్పుకునేందుకు ఇప్పటికే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డికి టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన టీఆర్‌ఎస్‌తో అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. ఇక మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇటీవల తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ కలకలం రేకెత్తించాయి. త్వరలో తాను కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని, తన నియోజకవర్గంలోని కీసర ఆలయానికి రావాలని ఆహ్వానిస్తానని చెప్పారు. తాజాగా మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు సీఎంను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. మహేందర్‌రెడ్డితో పాటు నగర శివార్లలోని మరి కొందరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నెల 11వ తేదీలోగా బీఆర్‌ఎస్‌లో భారీ కుదుపులు ఉంటాయనే ప్రచారం సాగుతోంది.

పాయే..!

మంజూరైన సబ్‌స్టేషన్ల నిధులు వెనక్కి

- జిల్లా వ్యాప్తంగా 10సబ్ స్టేషన్ల నిర్మాణానికి జీవోలు
- గడువులోగా పూర్తికాని పనులు


జిన్‌గుర్తి సబ్‌స్టేషన్

తాండూరు, ఫిబ్రవరి 8: గత ప్రభుత్వంలో జిల్లాకు మంజూరైన 10 విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.అప్పట్లో ఒక్కొక్క సబ్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 3కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపైన జీవో జారీ చేసింది.ఎస్టిమెంట్లు పూర్తి చేసి టెండర్ల ప్రక్రియ చేపట్టింది. రెవెన్యూ అధికారులు సకాలంలో ప్రభుత్వ స్థలాలు చూయించక పోవడంతో నిర్మాణాలు పెండింగ్‌లో వేశారు.తాండూరు నియోజకవర్గంలో యాలాల మండలం జుంటుపల్లి, తాండూరుమండలం జిన్‌గుర్తి, చంద్రవంచ, పెద్దేముల్ మండలం కందనెల్లి సబ్ స్టేషన్లు మంజూరు చేసి రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం కోసం విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులకులేఖలు పెట్టారు.తాండూరు మండలం జిన్‌గుర్తిలో మాత్రం పనులు ప్రారంభమయ్యాయి. తాండూరు నియోజకవర్గంలో జుంటుపల్లి, చంద్రవంచ, కందనెల్లికి విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టకపోడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. అత్యావసరం అయితే తప్పా సబ్ స్టేషన్లు నిర్మించాలని ఉన్నతాధికారులు వాటిని రద్దు చేశారు. ఈ విషయమై తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శాసన సభలో ప్రస్తావించి సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి తిరిగి నిధులు రప్పించాలని నిర్ణయించారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లను 2023 సెప్టెంబర్ 27న మంత్రి హరీశ్‌రావుతో శంకుస్థాపన చేయించారు. ఇవే సబ్ స్టేషన్లను ఐదేళ్ల క్రితం మహేందర్‌రెడ్డితో శంకుస్థాపన చేశారు. ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసినా జిన్‌గుర్తి సబ్‌స్టేషన్ మినహా ఇతర సబ్‌స్టేషన్ల పనులు ప్రారంభం కాలేదు.

ఈవీఎంలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి8: రాబోవు పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈవీఎంలను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి కలెక్టర్ ఓటరు ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంల మొదటి స్థాయి పరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. శాసన సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా తమ తోడ్పాటును అందించాలని కలెక్టర్ కోరారు.

పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం

కీసర: ప్రత్యేక ఓటర్ల జాబిత సవరణ అనంతరం మేడ్చల్ జిల్లాలో మొత్తం 28,75,907 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయలంలో వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో జిల్లాలో సవరించిన ఓటర్ల జాబిత విడుదల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా 10వేల 264 మంది ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకున్నారని తెలిపారు. ఆనంతరం కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో కలిసి ఫస్ట్ లెవల్ ఈవీఎంలను పరిశీలించారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.


మేడ్చల్ కలెక్టరేట్‌లో సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు

కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ పదవి

హస్తగతం?



కులకచర్ల, ఫిబ్రవరి 8: కులకచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవీ హస్తగతం కానుందా..? అంటే అవుననిపిస్తోంది. తిరుమలపూర్ సొసైటీ డైరెక్టర్‌గా అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకం మొగులయ్యను పది మంది డైరక్టర్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో తిరుమలపూర్ నుంచి డైరక్టర్‌గా మనోహర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మిగతా సంఘంలోని డైరక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా మనోహర్‌రెడ్డి ఎన్నికై అనంతరం డీసీసీబీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి మనోహర్‌రరెడ్డి గెలుపొందారు. దీంతో తిరుమలపూర్ డైరక్టర్ పదవీ, చైర్మన్ పదవీకి రాజీనామా చేయడంతో ఖాళీగా మారాయి. ప్రస్తుతం వైస్ చైర్మన్ నాగరాజు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. త్వరలోనే చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడనుంది. మొత్తం 13 మంది డైరక్టర్లు ఉండగా చైర్మన్ ఎన్నికలో 11 మంది డైరెక్టర్లు పాల్గొనే అవకాశం కనిపిస్తుంది. ఇద్దరు నాగరాజు, విజయ్‌కుమార్ పాల్గొనే అవకాశం కనిపించడం లేదు. కాంగ్రెస్ అభ్యర్థి తాను బలపర్చిన అభ్యర్థిని చైర్మన్‌ను చేసేందుకు ఎమ్మెల్యే మనోహరరెడ్డి అన్నీ తానై నడిపిస్తున్నారు. 11 మంది డైరెక్టర్లు మనోహరరెడ్డి సూచించిన అభ్యర్థికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది.

రోడ్డుపై పారుతున్న మురుగు

దోమ, ఫిబ్రవరి 8: అయినాపూర్ గ్రామంలోని 8వ వార్డులో మురుగునీరు రోడ్డుపై పారుతుండటంతో కాలనీలో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. గతంలో అండర్‌డ్రైనేజీ వేసి సీసీరోడ్డుకు నిధులు సరిపోకపోవడంతో తీర్మానం చేసి వదిలేశారని తెలిపారు. గ్రామానికి చెందిన ఓ పైరవీకారుడు ప్రత్యేకాధికారులపై ఒత్తిడి చేస్తూ తాను చెప్పినచోట రోడ్డు వేయాలని ప్రయత్నిస్తున్నాడని కాలనీవాసులు గోవర్దన్, బాబయ్యలు గురువారం విలేకరులతో వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.


రోడ్డుపై మురుగునీరు


నకల్ పుషప్స్‌లో కృష్ణారెడ్డి ప్రపంచ రికార్డ్

- నిమిషంలో 133 పుషప్స్



ప్రశంసా పత్రాన్ని చూపుతున్న చింతల కృష్ణారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి8: నకల్ పుషప్స్‌లో చింతల కృష్ణారెడ్డి ప్రపంచ రికార్డ్ సాధించారు. మేడ్చల్‌జిల్లా, ఘట్‌కేసర్ మండలం, అంకుషాపూర్‌కు చెందిన చింతల కృష్ణారెడ్డి నకల్ పుషప్స్ విభాగంలో నిమిషంలో 133 నకల్ పుషప్స్ చేసి ప్రపంచ రికార్డ్ సాధించారు. వరల్డ్ వైడ్ బుక్ అఫ్ రికార్డ్ ప్రతినిధులు గురువారం కృష్ణారెడ్డికి ప్రశంసాపత్రంతో పాటు మెడల్‌ను బహుకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమిషంలో 133 నకల్ పుషప్స్ చేయడంతో ఈ గౌరవం దక్కిందని, త్వరలో గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నిరంతరం సాధన చేయడం వల్లే ప్రపంచ రికార్డ్‌లో స్థానం దక్కిందని తెలిపారు.

తేలిన లెక్క!



- విడుదలైన వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో తుది ఓటరు జాబితా
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- అత్యధికంగా కుత్బుల్లాపూర్, పరిగిలో.. అత్యల్పంగా వికారాబాద్‌లో ఓటర్లు



వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి), ఫిబ్రవరి 8 : జిల్లా ఓటర్ల లెక్క తేలింది. జిల్లాలో మొత్తం 9,84,631 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. జిల్లాలో సాధారణ ఓటర్లు 9,84,068 మంది ఉండగా, సర్వీసు ఓటర్లు 541, ఎన్‌ఆర్ఐ ఓటర్లు 22 మంది ఉన్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నమోదైన తుది ఓటర్ల వివరాలను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి విడుదల చేశారు. జిల్లాలో ఓటర్లు అత్యధికంగా పరిగి నియోజక వర్గం పరిధిలో ఉండగా, తక్కువగా వికారాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉన్నారు. పరిగి నియోజకవర్గం పరిధిలో 2,66,273 మంది ఓటర్లు ఉండగా, వికారాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,31,679 మంది ఓటర్లు ఉన్నారు. తాండూరు నియోజక వర్గంలో 2,43,849 మంది ఓటర్లు, కొడంగల్ నియోజక వర్గం పరిధిలో 2,42,267 మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో పెరిగిన 13,057 మంది ఓటర్లు

జనవరి 6వ తేదీన ప్రకటించిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం వికారాబాద్ జిల్లాలో మొత్తం 9,71,011 మంది ఉండగా, ఎస్ఎస్ఆర్ ప్రక్రియ అనంతరం 9,84,068 మంది ఓటర్లకు పెరిగారు. ఓటర్ల ముసాయిదా జాబితాలో ప్రకటించిన ఓటర్ల సంఖ్య, తుది ఓటర్ల జాబితాలో ప్రకటించిన ఓటర్ల సంఖ్య పోల్చుకుంటే జిల్లాలో 13,057 మంది ఓటర్లు పెరిగారు. జిల్లాలో పెరిగిన 13,057 మంది సాధారణ ఓటర్లలో 3,583 మంది పురుషులు, 9,477 మంది మహిళలు ఉన్నారు. కాగా, ఓటర్ల ముసాయిదా జాబితాతో పోల్చుకుంటే తుది జాబితాలో ఇతర ఓటర్లు ముగ్గురు తగ్గారు. ముసాయిదా జాబితా ప్రకారం పరిగి నియోజకవర్గంలో 2,66,273 మంది సాధారణ ఓటర్లు ఉండగా, తుది జాబితా ప్రకారం 2,66,273 మంది ఓటర్లకు పెరిగారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,30,105 మంది ఓటర్లు ఉండగా, ఇప్పుడు 2,31,679 మందికి పెరిగారు. తాండూరు నియోజకవర్గంలో 2,39,651 మంది ఓటర్లు ఉండగా, తుది జాబితా ప్రకటన ప్రకారం 2,43,849 మందికి పెరిగారు. కొడంగల్ నియోజకవర్గంలో 2,38,877 మంది ఓటర్లు ఉండగా, తాజాగా 2,42,267 మందికి పెరిగారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత మార్పులు చేర్పుల ప్రక్రియ అనంతరం పరిగి నియోజకవర్గంలో 3,895, వికారాబాద్ నియోజకవర్గంలో 1,574, తాండూరు నియోజకవర్గంలో 4,198, కొడంగల్ నియోజకవర్గంలో 3390 మంది ఓటర్లు పెరిగారు.

ఇదిలా ఉంటే, జిల్లాలో మొత్తం సర్వీస్ ఓటర్లు 541 మంది నమోదు కాగా, వారిలో 530 మంది పురుషులు, 11 మంది మహిళలు ఉన్నారు. వీరిలో పరిగి నియోజకవర్గంలో 252 మంది నమోదు కాగా, వారిలో పురుషులు 249, మహిళలు ముగ్గురు ఉన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో 76 మంది ఉండగా, వారిలో 74 మంది పురుషులు, 2 మహిళలు, తాండూరు నియోజకవర్గంలో 49 మంది ఉండగా, వారిలో పురుషులు 48 మంది, ఒకరు మహిళా ఓటరు ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో 164 మంది ఉండగా, వారిలో 159 మంది పురుషులు, 5 గురు మహిళలు ఉన్నారు. కాగా, జిల్లాలో ఎన్ఆర్ఐ ఓటర్లు 22 మంది ఉండగా, వారిలో 20 మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. పరిగిలో 7, వికారాబాద్‌లో 7, తాండూరులో 7, కొడంగల్‌లో ఒక ఓటరు ఉన్నారు.

మూడు నియోజక వర్గాల్లో మహిళా ఓటర్లే అధికం

మూడు నియోజక వర్గాల్లో మహిళా ఓటర్లే అధికం

జిల్లాలో తాండూరు, కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. తాండూరు నియోజకవర్గంలో పురుషుల కంటే 7,386 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, కొడంగల్ నియోజకవర్గంలో పురుషుల కంటే 3,783 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోనూ పురుషుల కంటే 1,628 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. కాగా, పరిగి నియోజకవర్గంలో మహిళల కంటే 986 మంది పురుష ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

మేడ్చల్ జిల్లాలో ..

మేడ్చల్ జిల్లాలో 28,77,303 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘ ప్రకటించింది. తుది ఓటర్ల జాబితాలో జిల్లాలో సాధారణ ఓటర్లు 28,75,907 మంది, సర్వీసు ఓటర్లు 715, ఎన్ఆర్ఐ ఓటర్లు 681 మంది ఉన్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సాధారణ ఓటర్లలో పురుషులు 14,83,448 మంది ఉండగా, మహిళలు 13,92,074 మంది, ఇతరులు 385 మంది నమోదయ్యారు. జిల్లాలో అత్యధికంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఓటర్లు నమోదయ్యారు. జిల్లాలో 715 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా, వారిలో వారిలో 637 మంది పురుషులు, 78 మంది మహిళలు ఉన్నారు.

పెరిగిన ఓటర్లు 25,140

జనవరి 6వ తేదీన ప్రకటించిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం మేడ్చల్ జిల్లాలో 28,50,767 మంది ఓటర్లు ఉండగా, తుది జాబితా ప్రకటన వరకు మొత్తం ఓటర్ల సంఖ్య 28,75,907కు పెరిగింది. నెల రోజుల వ్యవధిలో జిల్లాలో 25,140 మంది ఓటర్లు పెరిగారు. పెరిగిన ఓటర్లలో 8,650 మంది పురుషులు, 16,483 మంది మహిళలు, 7 గురు ఇతర ఓటర్లు ఉన్నారు.

సాధారణ ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	ఎన్ఆర్ఐ	సర్వీసు	మొత్తం
వికారాబాద్	4,86,109	4,97,920	39	22	541	9,84,631
మేడ్చల్-మల్కాజ్‌గిరి	14,83,448	13,92,074	385	681	715	28,77,303

వికారాబాద్ జిల్లాలో నియోజక వర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	ఎన్ఆర్ఐ	సర్వీసు	మొత్తం
పరిగి	1,33,625	1,32,639	09	07	252	2,66,532
వికారాబాద్	1,15,019	1,16,647	13	07	76	2,31,762
తాండూరు	1,18,228	1,25,614	07	07	49	2,43,905
కొడంగల్	1,19,237	1,23,020	10	01	164	2,42,432
మొత్తం	4,86,109	4,97,920	39	22	541	9,84,631
మేడ్చల్ జిల్లాలో...						
మేడ్చల్	3,36,594	3,21,541	55	36	155	6,58,381
మల్కాజ్‌గిరి	2,51,376	2,48,148	12	244	246	5,00,026
కుత్బుల్లాపూర్	3,72,639	3,39,962	158	101	109	7,12,969
కూకట్‌పల్లి	2,46,371	2,25,386	121	129	50	4,72,057
ఉప్పల్	2,76,468	2,57,037	39	171	155	5,33,870
మొత్తం	14,83,448	13,92,074	385	681	715	28,77,303

రైల్వే అండర్ పాస్ రాకపోకలు షురూ

- అసంపూర్తి పనులు పూర్తి
- పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



మేడ్చల్ రైల్వే అండర్‌పాస్ వద్ద పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8: నాలుగు సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిన మేడ్చల్ రైల్వే అండర్‌పాస్ వంతెన పనులతో విసిగెత్తిన మేడ్చల్ రాజకీయ నాయకులు వంతెన కిందినుంచి రాకపోకలు కొనసాగించే విధంగా తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అండర్‌పాస్ వంతెన పనులు పూర్తికాకపోవటంతో పట్టణం నుంచి మండలంలోని ఏడు గ్రామాలకు వెళ్లేవారు గౌడవెల్లి గ్రామం మీదుగా వెళ్లాల్సివచ్చేది. గౌడవెల్లి రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ పనులు ప్రారంభించటంతో ఆ మార్గాన్ని మూసివేశారు. దీంతో స్థానికుల ఇబ్బందులు రెట్టింపయ్యాయి. ఫలితంగా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటుచేసి ప్రజల కష్టాలు తీర్చడమే ఏకైక మార్గంగా భావించిన మేడ్చల్ నేతలు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న అండర్‌పాస్ వంతెన కింది నుంచి గురువారం నుంచి తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేశారు. రాయిలాపూర్, గిర్మాపూర్ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులతో పాటు మేడ్చల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు లావణ్య హనుమంత్‌రెడ్డి, శివకుమార్ యాదవ్‌లు వాహనాలు రాకపోకలు జరిగే విధంగా టిప్పర్లతో వంతెన కింద మట్టిని పోయించారు. గతేడాది రైల్వే కట్టకు అవతలివైపు ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ జాతర సందర్భంగా చైర్‌పర్సన్ దీపిక ప్రత్యేక చొరవ తీసుకుని అండర్‌పాస్ కింద నుంచి రాకపోకలు కొనసాగే విధంగా తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటుచేశారు. గత వర్షాకాలంలో భారీవర్షాల కారణంగా వర్షపునీరు అండర్‌పాస్ వంతెనలో చేరి నాలుగు నెలలుగా ఆ కాస్త తాత్కాలిక బాట పూర్తిగా మూతపడింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు గౌడవెల్లి మార్గమూ మూతపడటంతో వంతెన కింది నుంచి తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటుచేసి కార్లు, బైక్‌లు, పాదచారులు రాకపోకలు కొనసాగించే విధంగా మార్గాన్ని ఏర్పాటు చేశారు.

పంచాయతీల్లో టీవీలు మాయం



గ్రామ పంచాయతీలో ఎంపీ రంజిత్‌రెడ్డి పంపిణీ చేసిన టీవీ

మర్పల్లి, ఫిబ్రవరి 8: కరోనా విజృంభిస్తున్న తరుణంలో విద్యా సంస్థలు మూతపడటంతో విద్యార్థులు చదువుకు దూరంగా కాకూడదనే ఉద్దేశంతో ఆన్‌లైన్ క్లాసులను కొనసాగింది. కొన్ని గ్రామాల్లో టీవీలు లేని కుటుంబాలు ఉండటంతో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మర్పల్లి మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు ఎల్ఈడీ టీవీలను అప్పట్లో పంపిణీ చేశారు. నామమాత్రంగా కొన్ని రోజులు ఆన్‌లైన్ తరగతులు కొనసాగించి లాక్‌డౌన్ ఎత్తేయడంతో ఆ టీవీలు మూలనపడ్డాయి. కొంత కాలం కిందట కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ టీవీలను ఇతర ప్రాంతాలకు తరలించగా ఇటీవల సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో కొన్ని గ్రామ పంచాయతీల్లో మిగిలిన టీవీలను సైతం మాయం చేశారు. గ్రామస్తులు పంచాయతీల్లో టీవీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తే సంబంధిత పంచాయతీ అధికారులు సమాధానమివ్వడంలేదు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఆస్తులపై అధికారుల తీరు సరికాదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీల్లో టీవీలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామపంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

తాండూరు, ఫిబ్రవరి 8: మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని వైద్య, ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, శానిటేషన్, సెక్యూరిటీ పేషంట్ కేర్ ఉద్యోగులకు గురువారం తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రతీనెల ఏజెన్సీలు వేతనం ఇవ్వాలని నిబంధన ఉన్నా నిబంధనను పాటించడంలేదని వారు వాపోయారు. నిరసన అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ మూర్తికి వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దు



సిబ్బంది స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల బస్తా

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 8: ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని పోచారం మున్సిపల్ చైర్మన్ వేమన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గురువారం ఆయన సిబ్బందితో కలిసి ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేదం ఉన్నందున్న కవర్లకు బదులు నార లేదా వస్త్రంతో తయారు చేసిన సంచులను వాడాలని ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి తమవంతు పాత్ర పోషించాలని కోరారు. అనంతరం ఎస్‌వీడీ వైన్స్‌పై మున్సిపల్ సిబ్బంది ఆకస్మిక సోదాలు నిర్వహించారు. భారీగా ప్లాస్టిక్ కవర్లను, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్న వైన్స్ నిర్వాహకులకు రూ.2వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణికుమారి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సాయితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరులోనే మెడికల్ కళాశాల, ఆస్పత్రి


మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 8 : కందుకూరులోనే మెడికల్ కళాశాల, 420పడకల ఆస్పత్రి నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కాలేజి నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కుట్ర పన్నిందనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికే గత ప్రభుత్వం హడావిడిగా మెడికల్ కాలేజిని మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం సీఎం రేవంత్‌రెడ్డి మెడికల్ కాలేజితో పాటు ఆస్పత్రిని నిర్మించడానికి సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో భూమి పరిశీలన చేయించారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. మెడికల్ కాలేజి, ఆస్పత్రి నిర్మాణానికి త్వరలో సీఎం పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

గ్యాస్ కనెక్షన్ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ


ఆన్‌లైన్ నమోదు వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 8 : గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన వివరాలను తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. గురువారం నవాబ్‌పేట్ మండలంలోని నవాబ్‌పేట్, చిట్టిగడ్డ, దాతాపూర్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా పాలన దరఖాస్తులలో గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన డాటాఎంట్రీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ చేసే క్రమంలో డాటాఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్లు పొందే విధంగా డాటా ఎంట్రీని చేయాలని ఆయన సూచించారు. ఆయనతో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, తహసీల్దార్ జయరాం ఎంపీఓ విజయ్ కుమార్‌తో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి

వికారాబాద్, ఫిబ్రవరి 8 : యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదుగాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ అన్నారు. గురువారం వికారాబాద్ లోని స్వాగత్ హోటల్‌లో నిరుద్యోగ యువత కోసం ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ డైరెక్టరేట్ (డీఈటీ), సంకల్ప్ స్కిల్ డెవలప్‌మెంట్, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్వయంఉపాధి, వేతన ఉపాధి, మహిళలు, యువతకు గల అవకాశాలపై అవగాహన కల్పించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, ట్రైనర్లు వెంకటేష్, శ్రీధర్, ఏపీసీసీ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ దుర్గారెడ్డి, కన్సల్టెంట్ శ్రీనివాస్, యువతి, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు, కిట్లు అందజేశారు.

అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలు కూల్చిన రెవెన్యూ అధికారులు

శంషాబాద్ రూరల్ 8 : శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ గ్రామ పరిధి లోని హమీదుల్లానగర్‌లో పలువురు మునిసిపాలిటీ అనుమతి లేకుండా నిర్మించిన పలు నిర్మాణాలను గురువారం తహసీల్దారు నాగమణి, ఆర్ఐ సంజీవ తమ సిబ్బందితో కూల్చివేశారు. ప్రభుత్వ, మునిసిపల్ అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని రెవెన్యూ అధికారుల ఆదేశాలను నిర్మాణదారులు పట్టించుకోకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.8 ఏఎమ్ ఎల్ 6: పూజలు నిర్వహిస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

మతం కంటే మానవత్వం గొప్పది

● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి


ప్రార్థనలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 8 : కులం, మతం కంటే మానవత్వం గొప్పదని, అన్ని మతాల సారాంశం అదేనని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విశ్వాసాలు వేరైన ప్రజలంతా ఒకే కుటుంబంలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జీడిపల్లి హజ్రత్ ఖాజా దర్గాను గురువారం సందర్శించి, ఉర్సు ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సన్మార్గంతో ముందుకు సాగే వారు జీవితంలో ఉన్నతంగా రాణించి ఆనందమయ జీవితాన్ని పొందుతారన్నారు. మాజీ సర్పంచ్ కల్పన కృష్ణయ్య, నాయకులు ఖాజామోయినోద్దీన్, విజయ్ గౌడ్, సుభాష్, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్, సతీష్, సుమన్, గణేశ్, పాల్గొన్నారు.


విరబూసిన మోదుగుపూలు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 8: ప్రకృతిలో సహజ సిద్ధంగా సీజన్‌ను బట్టి చెట్లు చిగురించడం, పుష్పాలు వికసించడం జరుగుతుంది. ప్రస్తుత సీజన్‌లో మోదుగుపూలు వికసించి చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఈ పూలను శివాలయాల్లో పూజలకు ఉపయోగిస్తారు. అదే విధంగా హోళీ పండగకు రసాయనాలు లేకుండా రంగులను తయారు చేసేందుకు మోదుగుపువ్వులను ఉపయోగిస్తారు. రైతులు పశువైద్యంలో కూడా వినియోగిస్తుంటారు.

జాడలేని భగీరథ నీరు!

● కొన్ని కాలనీలకు నల్లా కనెక్షన్‌లు, నీటి సరఫరానే లేదు

● ఇబ్బందులు పడుతున్న కొత్త కాలనీల వాసులు

● పట్టించుకోని మునిసిపల్, మిషన్‌భగీరథ అధికారులు

పరిగి, ఫిబ్రవరి 8 : మునిసిపల్ పరిధిలో నీటిసరఫరా అస్తవ్యస్తంగా మారింది. మిషన్‌భగీరథ అధికారుల ఇష్టారాజ్యం, మునిసిపల్ అధికారుల అలసత్వం కారణంగా నీటికోసం పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం ఏటేటా విస్తరిస్తూ కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. కానీ అందుకు అనుగుణంగా నీటి సరఫరా జరుగడం లేదు. పలు కాలనీలకు అసలు నల్లా పైప్‌లైన్, కనెక్షన్లే లేవు. పట్టణంలో ఎక్కువగా వ్యక్తిగత బోర్ల ద్వారా నీటి వినియోగం జరుగుతున్నప్పటికీ, బోర్లలో నీరు తగ్గినప్పుడు వారి అవస్థలు చెప్పుకోలేనివి. అధికారులు, పాలకులకు ముందుచూపులేని కారణంగా నీటి సమస్య తలెత్తుతున్నది. మునిసిపల్ అధికారుల అలసత్వం వల్ల అనేక కాలనీల్లో నీళ్లు వృథాగా పోతుండగా మరికొన్ని కాలనీల్లో అసలు నీటివసతే లేకపోవడం వల్ల ఆయా కాలనీల్లో వ్యక్తిగత బోర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. మునిసిపల్ పరిధిలో ప్రస్తుతం సుమారు 26 వేల జనాభా ఉంటుంది. ఈ లెక్కల ప్రకారం ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల చొప్పున 35.10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, ప్రస్తుతం రోజుకు 18 లక్షల లీటర్ల నీటిని మాత్రమే మునిసిపాలిటీ సరఫరా చేస్తోంది. సగటు వ్యక్తికి 80 లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం మిషన్ భగీరథ నీరు సగం మాత్రమే సరఫరా అవుతోంది. పలుకాలనీల్లో అసలు నీటి జాడ లేకపోగా, నల్లాలు ఉన్న కాలనీల్లో నీరు వృథాగా పోతున్నదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

నీటివసతి లేని కాలనీలు

మునిసిపల్ పరిధిలో నీటి సరఫరా అసలే లేని కాలనీలు చాలానే ఉన్నాయి. తిరుమల రెసిడెన్సీ, భవానినగర్, అనంతనగర్, మైత్రీనగర్, అనురాగ్‌కాలనీ, అనంతంకాలనీ, వెంకటేశ్వరకాలనీ, శ్రీనివాసకాలనీ, పట్టణ శివారులోని అన్ని కాలనీలు, సుల్తాన్‌నగర్‌వెళ్ళే దారిలోని కాలనీలకు నీటి సరఫరా కోసం పైపులైన్లు కూడా లేవు. ఈ కాలనీల్లో నీటి సరఫరా అసలు జరుగడం లేదు. ఈ కాలనీల్లోని ప్రజలంతా వ్యక్తిగత బోర్ల ద్వారానే కాలం గడుపుతున్నారు. మునిసిపాలిటీకి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా, నీటి వసతిని కల్పించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కొత్తకాలనీల్లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పలుకాలనీల్లో నీరంతా వృథా..

నల్లా కనెక్షన్లు ఉన్నచోట్ల పైపులైన్‌లు దెబ్బతినడం వల్ల, మరికొన్ని చోట్ల ట్యాంకులు నిండి నీరంతా వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పలుకాలనీల్లో నీళ్లు సరిపోయిన తర్వాత పైపులను మురికికాలువల్లోకి వదులుతున్నారు. సిద్ధాంతికాలనీ, విజయ్‌నగర్‌కాలనీ, శ్రీనివాస్‌నగర్‌కాలనీ, కొడంగల్ చౌరస్తాలో మిషన్‌భగీరథ నీరు వృథాగా పోతున్నది. అధికారుల తీరు వల్ల నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నల్లా కనెక్షన్ కోసం రెండేళ్ళుగా తిరుగుతున్నా



నల్లా కనెక్షన్ కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కనెక్షన్ కోసం రూ.6500 అడిగారు. కడతామనిచెప్పినా కనెక్షన్ ఇచ్చేందుకు అధికారులు ముందుకు రావడంలేదు.

-శివారెడ్డి, అనంతనగర్‌కాలనీ, పరిగి

కొత్తకాలనీలకు నీటిసరఫరా లేదు



తిరుమల రెసిడెన్సీకాలనీలో ఇళ్లు నిర్మించుకుని మూడేళ్ళు గడిచిపోయినా ఇప్పటి వరకు మునిసిపల్ నుంచి పైపులైన్ కూడా వేయలేదు. వ్యక్తిగత బోర్లతోనే కాలం గడపుతున్నాం. అధికారులు స్పందించి కొత్తగా వాటర్ ట్యాంకు, పైపులైన్ వేయాలి.

-నాగేశ్, తిరుమల రెసిడెన్సీ,పరిగి


నీటి సరఫరా లేని తిరుమల రెసిడెన్సీ కాలనీ

భగీరథ నల్లా కనెక్షన్‌లు ఇవ్వాలి



మూడేళ్ళ క్రితం ఇల్లు నిర్మించుకున్నాం. వ్యక్తిగత బోరుతో గడుపుతున్నాం. నల్లాకోసం కావాలని అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. అధికారులు చొరవ తీసుకుని భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వాలి.

-రాజశేఖర్, భవానీనగర్, పరిగి

అన్ని కాలనీల్లో నీటిసరఫరాకు చర్యలు



పరిగి మునిసిపల్ జనాభాకు అనుగుణంగా ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల చొప్పున నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్త కాలనీల్లో భగీరథ నల్లా కనెక్షన్‌లకోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. కొత్తగా వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్‌ల కోసం ప్రభుత్వానికి నివేదించాం. కాలనీల్లో కొత్త కనెక్షన్‌లు ఇచ్చేందుకు త్వరలో చర్యలు తీసుకుంటాం.

-ఎం.అశోక్‌కుమార్ మునిసిపల్ చైర్మన్ పరిగి

మల్లారెడ్డి యూనివర్సిటీలో సద్దుమణిగిన ఆందోళన

● యాజమాన్యం, విద్యార్థిసంఘాల నేతల మధ్య చర్చలు



యూనివర్సిటీ యాజమాన్యంతో చర్చలు జరుపుతున్న విద్యార్థిసంఘాల నాయకులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8 : వారం రోజులుగా పురుగుల అన్నం పెడుతున్నారంటూ బుధవారం రాత్రి మల్లారెడ్డి యూనివర్సిటీ బాలికల హాస్టల్ క్యాంటీన్‌లో చేపట్టిన నిరసనను విద్యార్థులు విరమించారు. పలువురు యూనివర్సిటీ అధికారులు క్యాంటీన్ వద్దకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో వారు శాంతించారు. కాగా గురువారం ఉదయం విద్యార్థుల తరఫున నిరసన చేపట్టటానికి యూనివర్సిటీ వద్దకు పలు విద్యార్థి సంఘాల నేతలు చేరుకోవటంతో క్యాంటీన్ నిర్వాహకులు వారితో చర్చలు జరిపారు. వంటచేసే వారిపై చర్యలు తీసుకోవటంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థిసంఘాల నేతలు నిరసనను ఉపసంహరించుకున్నారు. కాగా వారం రోజుల పాటు ఎంత మొర పెట్టుకున్నా క్యాంటీన్ నిర్వాహకులు తమగోడును పట్టించుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నంలో, పప్పులో పురుగులు రావటం మామూలుగా మారిందన్నారు. అన్నం తిన్నవిద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని చెప్పినా నిర్వాహకులు పట్టించుకోలేదని పలువురు విద్యార్థులు ఆరోపించారు. ఫుడ్‌పాయిజన్‌తో ఆసుపత్రి పాలయిన విద్యార్థులు చాలా మంది ఉన్నారని, క్యాంటీన్ నిర్వాహణ సక్రమంగా లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించటంతో పాటు క్యాంటీన్‌లో పరిశుభ్రత పాటిస్తామని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. క్యాంటీన్ నిర్వాహణలో అలసత్వాన్ని సహించబోమని చెప్పారు.

భూములు కోల్పోయే వారికి ఉద్యోగాలు


రైతులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి, ఆర్డీవో

కొడంగల్, ఫిబ్రవరి 8: మెడికల్, నర్సింగ్ కళాశాలలు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూ సేకరణలో నష్టపోయే రైతులకు వారి అర్హత మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆర్‌డీవో శ్రీనివాస్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అప్పాయిపల్లిలోని సర్వే నెం.19లో 75 ఎకరాల భూ సేకరణను ప్రభుత్వం ప్రారంభించింది. అందులో భాగంగా భూములు కోల్పోయే రైతులతో ఆర్డీవో, కడా ప్రత్యేకాధికారి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు సమీక్షా సమావేశం నిర్వహించారు. కొడంగల్ అభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని వారు కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్వే నెం.19లో అసైన్ పట్టాలు పొందిన రైతులందరూ సహకరిస్తే వారి కుటుంబసభ్యులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రైతులు సానుకూలంగా స్పందించి సహకారం అందిస్తామని తెలిపినట్లు తహసీల్దార్ చెప్పారు. అసైన్డ్ భూములను అభివృద్ధి పనులకు తీసుకోవడం వల్ల ఎవరికి నష్టం వాటిల్లదన్నారు. రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో డిప్యుటేషన్లు రద్దు

● యథాతద స్థానాలో పనిచేయాలని ఆదేశాలు


రిలీవ్ ఆర్డర్

తాండూరు, ఫిబ్రవరి 8 : వైద్యశాఖలో వివిధ ప్రాంతాల్లో డిప్యుటేషన్‌లపై విధులు నిర్వహిస్తున్నవారు తక్షణమే తమకు పోస్టింగ్ కేటాయించిన ప్రాంతంలోనే పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం (ఫిబ్రవరి 7న)ఉత్తర్వులు జారీ చేసింది. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తూ వివిధ కారణాలతో డిప్యుటేషన్‌పై ఇతర ఆస్పత్రులకు వెళ్ళిన 6గురు వైద్యులు, 10మంది నర్సింగ్ స్టాఫ్, 7గురు పారామెడికల్ సిబ్బంది యథావిధిగా వారి పోస్టింగ్‌ల్లో చేరాలని ప్రభుత్వ ఇచ్చిన ఆదేశాల్లో ఉంది. తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ గా పనిచేసి మెదక్‌జిల్లాకు డిప్యుటేషన్‌పై వెళ్ళిన డాక్టర్ మల్లిఖార్జున్ ఇప్పటికే రీజాయినింగ్ కోసం తిరిగి వచ్చారు. ఈ ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫార్మాసిస్టులు ముగ్గురు, రికార్డ్ అసిస్టెంట్, ల్యాబ్‌టెక్నీషియన్‌లు 5గురు, స్టాఫ్ నర్స్‌లు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఇందులో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా ఉన్నారు. తాండూరు ఆస్పత్రికి చెందిన సివిల్ సర్జన్, హెడ్‌నర్స్‌లు, ఫార్మాసిస్టులు జాయిన్ అయ్యారు.

యథేచ్ఛగా నాపరాయి తవ్వకాలు

● ప్రభుత్వ భూముల్లో జోరుగా దందా

● రాయల్టీ లేకుండానే రవాణా

● అధికారులనూ లెక్కచేయని అక్రమార్కులు


నాపరాయి లోడ్ కోసం వచ్చిన లారీ(ఫైల్)

బషీరాబాద్, ఫిబ్రవరి 8: ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకున్నానాపరాయి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. లీజుల పేరిట కొందరు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి మరి కొందరు అక్రమంగా సహజ వనరులను దోచేస్తున్నారు. చెరువు శిఖం, ఆర్అండ్‌బీ రోడ్లు, రైల్వే పట్టాల పక్కన ఉండే భూములను కబ్జా చేసి అక్రమ త్వకాలు చేపడుతున్నారు. మైన్స్‌లీజులు, రాయల్టీలు లేకుండానే విలువైన నాపరాళ్ల నిక్షేపాలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బషీరాబాద్ మండలంలోని నవాల్గ, కొర్విచెడ్, మాసన్‌పల్లి, క్యాద్గీరా, జీవన్గి, ఎక్మాయి గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో విరివిగా నాపరాళ్ల నిక్షేపాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పలువురు వ్యాపారులు లీజుల మాటున ప్రభుత్వ సంపదను లూటీ చేస్తున్నారు. కొర్విచెడ్ గ్రామం సమీపంలోని చెరువు శిఖం భూముల్లో అక్రమార్కులు నాపరాళ్ల తవ్వకాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములు, రైల్వేపట్టాల వద్ద పలువురు యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నారు. జీవన్గి ఆర్అండ్‌బీ రోడ్డు మార్గం పక్కనే నిబంధనలకు విరుద్ధంగా పలువురు నాపరాళ్ల తవ్వకాలు జరుపుతున్నారు. మరికొందరు వ్యాపారులు నాపరాళ్ల తవ్వకాలకు తీసుకున్న లీజు గడువు ముగిసినా యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగిస్తూ దొరికినకాడికి దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల అండదండలతోనే ఈ తవ్వకాలు నిరాటంకంగా కొనసాగసాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడే మైన్స్, రెవెన్యూ అధికారులు నాపరాళ్ల గనులపై దాడులు జరుపుతూ ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో అక్రమార్కులకు కలిసివస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ తవ్వకాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నాపరాయిని తొవ్వుతున్న దృశ్యం

శిలాఫలకాలు పెట్టారు.. పనులు మరిచారు


శిలాఫలకం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 8 : కొడంగల్ మండలంలో అంగడిరైచూర్ నుంచి ధర్మాపూర్ వరకు, రుద్రారం నుంచి పాటిమీదిపల్లి వరకు బీటీ రోడ్డు వేసేందుకు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హడావుడిగా శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసినా ఆ పనులు ప్రారంభం కాలేదు. వెంటనే పనులు ప్రారంభించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ పనుల కోసం సీఆర్ఆర్ నిధులు రూ.2 కోట్ల 70 లక్షలతో బీటీ రోడ్డు పనులను 23-9-2023న శంకుస్థాపన చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా గత ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8 : న్యాయ వ్యవస్థలో పనిచేసే న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పవన్‌కుమార్, విజయ్‌రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ కోర్టులో సికింద్రాబాద్ యశోధ ఆసుపత్రి వారు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్, విజయ్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు పని వత్తిడి కారణంగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. బీపీ, షుగర్ ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు. ఉచితవైద్య శిబిరం నిర్వహించిన యశోధ ఆసుపత్రి వారికి ధన్యవాదాలు తెలిపారు. పలువురు న్యాయవాదులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో భారత్ వెలిగిపోతోంది

● మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


ప్రసాదాన్ని అందిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

పెద్దేముల్, ఫిబ్రవరి 8 : మోదీ నాయకత్వంలో భారత్ వెలిగిపోతోందని, అన్ని దేశాలు భారత్‌తో సత్ససంబంధాలు పెట్టుకోవాలని చూస్తున్నాయని చేవెళ్ళ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గావ్‌చలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని తట్టెపల్లి గ్రామంలో గురువారం పర్యటించి గ్రామస్థులతో ముచ్చటించారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అయోధ్య రామమందిరం నుంచి తీసుకువచ్చిన ప్రసాదాన్ని గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ప్రజాప్రతినిధులకు, నాయకులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోది 'గావ్ ఛలో అభియాన్' కార్యక్రమాన్ని తీసుకొచ్చారని చెప్పారు. మోదీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 4135 కిలోమీటర్లు రోడ్లు వేశారని చెప్పారు. కరోనా సమయంలో పేదదేశాలకు టీకాలను పంపిణీ చేసి అక్కడి ప్రజలను మోదీ ఆదుకున్నారని చెప్పారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి రమేష్, జిల్లా నాయకులు బంటార్వం భద్రేశ్వర్, మండల అధ్యక్షుడు సందీప్‌కుమార్, సంగమేశ్వర్, ఉపేందర్ పాల్గొన్నారు.

సేవాభావంతోనే సమాజంలో కీర్తి


పండ్లు అందజేస్తున్న ప్రతినిధులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 8: సేవాభావం, దాతృత్వంతోనే సమాజంలో కీర్తి లభిస్తుందని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ వైద్యుడు డాక్టర్ సి.శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో లయన్స్‌క్లబ్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మంజుల , లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్, కోశాధికారి కొరివి వెంకటయ్య, పీఆర్‌వో ఎం.ఎ పాషా, సభ్యులు కర్నాటి కొండల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, బాలకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటా

చేవెళ్ల, ఫిబ్రవరి 8 : పలుగుట్ట గ్రామాభివృద్ధికి గ్రామస్థుల సహకారం ఎంతో ఉందని, ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తాజా మాజీ సర్పంచ్ మల్గారి జనార్ధన్‌రెడ్డి అన్నారు. పంచాయతీ పాలకవర్గం సభ్యుల పదవికాలం ఇటీవల ముగిసిన సందర్భంగా వారికి గ్రామ ప్రత్యేకాధికారిణి డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యాలయంలో సన్మానం చేశారు. ఈసందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకున్నా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, టీసీసీ నాయకుడు జి. శ్రీనివాస్‌గౌడ్, తాజా మాజీ ఉపసర్పంచ్ యాదమ్మరాములు, నాయకులు చల్మారెడ్డి, రామ్‌రెడ్డి, మాజీసర్పంచ్ నర్సింలు, నాయకులు మనోహర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, బాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యస్వామి, శేఖర్‌రెడ్డి, జంగయ్య, యూత్ కార్యదర్శి కార్తీక్‌రెడ్డి, గ్రామస్థులు, వార్డు సభ్యులు ఉన్నారు.


పాలక వర్గం సభ్యులు

కార్మికులకు ఒకపూట పని కల్పించాలి



అదనపు కలెక్టర్‌కు కలిసి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకుడు మహిపాల్

వికారాబాద్, ఫిబ్రవరి 8: మున్సిపాలిటీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు ఒకపూట పని కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 4గంటల నుంచి 12గంటల వరకు మాత్రం పని చెప్పాలన్నారు. రెగ్యులర్ జీతాలిస్తూ పెండింగ్‌లో ఉన్న యూనీఫామ్స్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఓటర్ తుది జాబితా విడుదల

తాండూరు, ఫిబ్రవరి 8: తాండూరు ఓటర్ తుదిజాబితాను అధికారులు గురువారం విడుదల చేశారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత నూతన ఓటు దరఖాస్తు తీసుకున్న తర్వాత గురువారం తుదిజాబితా ప్రకటించారు. తాండూరులో మొత్తం 2,43,849కాగా, పురుషులు 118228, స్త్రీలు 125614, ట్రాన్స్‌జెండర్లు ఏడుగురు ఉన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారం ఇవ్వడానికి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

ప్రొసీడింగ్‌లు కావు.. చిత్తు కాగితాలు



తాండూరులో విలేకరులతో మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

- చర్చకు మేము సిద్ధం
- మాజీ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతల సవాల్

తాండూరు, ఫిబ్రవరి 8: మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనుల పేరిట మభ్యపెట్టి చిత్తు కాగితాలను ప్రొసిడింగ్‌లుగా నమ్మించారని పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ రవి గౌడ్ పేర్కొన్నారు. గురువారం తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రోహిత్‌రెడ్డి అబద్దాల కోరని ఆరోపించారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది పార్టీ మారిన రోహిత్‌రెడ్డికి కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదన్నారు. డబ్బుల్లేని ప్రొసీడింగ్‌లను నిరూపిస్తామని, చర్చకు రావాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనులు చేయడం చేతకాలేదని విమర్శించారు. బంజారా, అంబేడ్కర్ బీసీ భవనాలు జీవోలు ఉత్తివేనని అన్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, నాయకులు కొమ్ముగోపాల్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

నాటు వైద్యం పేరుతో వసూళ్లు

- జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 8: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గోశాల సంపూర్ణ ఆయుర్వేదాలయం పేరుతో నాటు వైద్యం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ పల్లుల మాదవరెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు గురువారం జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండా గోశాల సంపూర్ణ ఆరోగ్యాలయం పేరుతో ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నాటు వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బర్ల హరిశంకర్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే షౌకత్‌మియా, కృపా, సిరాజ్ పాల్గొన్నారు.



జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తున్న వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

క్రైం కార్నర్

అన్నంలో బొద్దింక.. హోటల్‌పై ఫిర్యాదు



హోటల్‌లో వడ్డించిన అన్నంలో బొద్దింక



హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8: మేడ్చల్ పట్టణంలోని దర్శిని హోటల్‌లో వండిన సాంబార్‌లో బొద్దింకరావటంతో బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. హోటల్‌లో బుధవారం ఓకస్టమర్ అన్నం తింటుండగా సాంబర్‌లో బొద్దింక వచ్చింది. దీంతో హోటల్ నిర్వాహకులను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో సాంబార్‌లో వచ్చిన బొద్దింక ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో మున్సిపల్ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తన సిబ్బందితో కలిసి హోటల్‌లో గురువారం తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా హోటల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోటల్ యజమానికి నోటీసు జారీచేశామని, విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని శంకర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో మంటలు



ఇంట్లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పరిగి, ఫిబ్రవరి 8: పరిగి మండలం పొల్కంపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గురువారం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకునేలోపే ఇంట్లోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే వారం కిందట రోడ్డు ప్రమాదంలో పొల్కంపల్లికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈకేసులో ఇంటి యజమాని రమేశ్ పరారీలో ఉన్నాడు. వారం రోజులుగా ఆ ఇంట్లో ఎవరూ లేరు. కాగా, ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు అంటుకున్నాయా? లేక మృతుల కుటుంబసభ్యులు ఉద్దేశపూర్వకంగా ఈ పని చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న శ్రీనివాస్

పెద్దేముల్, ఫిబ్రవరి 8: ఈనెల 16వ తేదీన చేపట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. సీఐటీయూ తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పెద్దేముల్ ఎంపీవోకు సమ్మె నోటీసును అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు ఇచ్చి కార్మిక వర్గానికి ఒరగబెట్టింది ఏమీలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మత తత్వ విధానాలను కార్మికులు ప్రతిఘటించాలని సూచించారు. దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు అంబరప్ప, రాములు, లక్ష్మీ, శ్రీనివాస్, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



పరిగిలో ఖోఖో క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

పరిగి,ఫిబ్రవరి 8: క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి పరిగికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. జిల్లా ఖోఖో అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం పరిగి మినీస్టేడియంలో క్రీడాకారులకు టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు మంచి భవిష్యత్తులు ఉంటుందన్నారు. విద్యతోపాటు, క్రీడల్లోనూ ప్రతిభను చాటాలని సూచించారు. క్రీడాకారులకు తమవంతు పూర్తి సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి హన్మంత్‌రావు, మాజీ వైఎస్ ఎంపీపీ డి.మాణిక్యం, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, బి.పరశురాంరెడ్డి, కౌన్సిలర్లు ఎదిరె కృష్ణ, రవి కుమార్, నర్సింహులు, తాహిర్, అలీ, నాగవర్దన్, కోచ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కేరెల్లిలో బీజేపీ నాయకుల పర్యటన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధారూరు, ఫిబ్రవరి 7: బీజేపీ ఆధ్వర్యంలో కేరెల్లి గ్రామంలో గురువారం ఆపార్టీ నాయకులు పర్యటించి వివిధ వర్గాల నాయకులను కలిసి కేంద్రప్రభుత్వ పథకాలను వివరించారు. గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాయకులు గ్రామంలో పర్యటించి రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని పాఠశాల ఉపాధ్యాయులు, రైతులు, ఉపాధిహామీ కూలీలు, ఓటర్లను, మహిళలను వారు కలిసి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఈ పథకాలతో లబ్ధిపొందిన వారితో వారు సమావేశమై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, రేషన్ బియ్యం, పీఎం కిసాన్, ఉపాధిహామీ పనులు, ఉపాధిహామీ నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు తదితర పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వివరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి పాండుగౌడ్‌ను నాయకులు సన్మానించారు. గ్రామంలోనే రాత్రి బసచేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి వివేకనందరెడ్డి, నాయకులు ఎం.రమేశ్, రాజేందర్‌గౌడ్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సాయిగౌడ్, వంశీధర్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐలకు కాంగ్రెస్ నాయకుల సన్మానం



ఎస్ఐలను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

ధారూరు, ఫిబ్రవరి 8: ధారూరు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ గౌడ్, ఇక్కడి నుంచి పరిగి పీఎస్‌కు బదిలీ అయిన ఎస్ఐ సంతోష్‌కుమార్‌లను గురువారం కాంగ్రెస్ నాయకులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కొత్త ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌కు స్వాగతం పలికి, బదిలీ అయిన సంతోష్‌కుమార్‌కు వారు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుజ్జయ్య గౌడ్, పాండునాయక్, బాబాఖాన్, ఆశోక్ ముదిరాజ్, మల్లికార్జున్, ఎన్. ఆశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సత్కారం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 8: గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ బాలమణితో పాటు పాలకవర్గ సభ్యుల సేవలు మరవలేనివని గ్రామస్థులు అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గురువారం మండలంలోని పాటిమీదిపల్లి గ్రామంలో సర్పంచ్ బాలమణి, పాలకవర్గ సభ్యులను గ్రామస్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామస్థులు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, బసప్ప, శేఖర్, రుక్కప్ప, గంగమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



ఎమ్మెల్యేను కలిసిన తాజామాజీ సర్పంచ్, తండా యువకులు

పరిగి, ఫిబ్రవరి 8: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్, లంబాడ హక్కుల పోరాట సమితిరాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్‌లు అన్నారు. ఫిబ్రవరి 15న సేవలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా గురువారం ఉదయం గిరిజన సంఘాల నాయకులు గోవింద్, శ్రీనివాస్, గణేశ్, నరేషన్‌లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60లక్షల జనాభా కలిగిన గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

బషీరాబాద్: సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని బషీరాబాద్ మండలం భోజ్యానాయక్‌తండా తాజామాజీ సర్పంచ్ శాంతి గోపాల్, తండా యువకులు పలువురు కోరారు. హైదరాబాద్‌లోని నివాసంలో గురువారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలిసి వారు ఘనంగా సన్మానించారు. పదేళ్లుగా సేలాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించేలా అసెంబ్లీలో చర్చించాలని కోరారు.

ఎస్ఐకి శుభాకాంక్షల వెల్లువ



ఎస్ఐ విఠల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పండరి, తదితరులు

తాండూరురూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కరన్‌కోట్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విఠల్‌రెడ్డిని మల్కాపూర్ గని కార్మిక సంఘం మాజీ వైస్‌చైర్మన్ పండరి ఆధ్వర్యంలో నాయకులు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ విఠల్‌రెడ్డిని కలిసి మిఠాయిలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నియోజకవర్గ నాయకులు పి.రాములు, శివప్ప, బందెప్ప, మైనుద్దీన్, మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్ మజీద్, మాజీ వార్డుసభ్యులు పండరి చారి, తదితరులున్నారు.

మోమిన్‌పేట్ ఎస్ఐగా అరవింద్



మోమిన్‌పేట్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అరవింద్

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ నూతన ఎస్ఐగా అరవింద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తాండూర్ టౌన్ ఎస్ఐగా ఆయన ఎనిమిది నెలలు విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై మోమిన్‌పేట్ ఎస్ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల కట్టడిలో తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న కడా ప్రత్యేకాధికారి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 59మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రవి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు రాజేశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహులునాయుడు, మాజీ వైస్ ఎంపీపీ దేశ్యానాయక్, బాల్‌రాజ్‌గౌడ్, మల్లేశ్, రాములు, మాజీ సర్పంచ్ కాశప్ప పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మూడు చింతలపల్లి, ఫిబ్రవరి 8: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని మాజీ సర్పంచ్ లలితనర్సింహులు అన్నారు. మండలంలోని అద్రాస్‌పల్లి గ్రామంలో గురువారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 125మందికి బీపీ, షుగర్, చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్ గర్భసంచికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వస్తున్న ఆస్పత్రులకు గ్రామ పంచాయితీ తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రజలు, గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, పంచాయతీకార్యదర్శి ఉష, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మురళీధర్

కులకచర్ల, ఫిబ్రవరి 8: గ్రామంలో సమస్యల పరిష్కారంపై దృష్టిసారించినట్లు తహసీల్దార్, ప్రత్యేకాధికారి మురళీధర్ అన్నారు. కులకచర్ల పంచాయతీలో ఎంపీటీసీ ఆనందంతో కలిసి గురువారం సంబంధిత అధికారులు, ప్రజలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏ సమస్యలున్నా తమ తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానికంగా అందుబాటులో ఉంటామని సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎర్ర గోవిందు తండాలో ప్రత్యేకాధికారి రమేశ్, ఎంపీపీ సత్యహరిశ్చంద్రతో కలిసి గ్రామసభ నిర్వహించారు. పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు.

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం



శ్మశాన వాటికకు వెళ్లే దారిని చదును చేయిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్

వికారాబాద్, ఫిబ్రవరి 8: వికారాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌లో శ్మశాన వాటికకు రోడ్డు వేసి ప్రజలు ఇబ్బందులు తీరుస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ బొండల శ్రీనివాస్ తెలిపారు. ఇందిరానగర్ నుంచి శ్మశాన వాటికకు వెళ్లే దారిని గురువారం జేసీబీతో చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతం నుంచి రైల్వే అధికారుల వల్ల సమస్య అలాగే ఉండిపోయిందని, ప్రస్తుత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ సహకారంతో ఈరోడ్డు పనులు ముందుకు సాగాయన్నారు. కాలనీవాసులు కౌన్సిలర్ బొండల సువర్ణ, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఈరోడ్డు పనులను దగ్గరుండి చేయిస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల, ఫిబ్రవరి 8: కేంద్రంలో ముచ్చటగా మూడవసారి బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అచ్యుతాపూర్‌లో గురువారం నిర్వహించిన గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం సురక్షితంగా వుండాలంటే ప్రతీఒక్కరు బీజేపీకి ఓటువేయాలని సూచించారు. కాంగ్రెస్‌కు ఓటువేసి వృథా చేసుకోరాదని తెలిపారు. రామమందిర్ నిర్మాణం దేశానికి ఆదర్శమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పరి రమేష్, శంకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

గుంతను పూడ్చరా?



చన్‌గోముల్-రేగిడిమామిడిపల్లికి వెళ్లే సీసీరోడ్డు మధ్య ఏర్పడిన గుంత

పూడూరు, ఫిబ్రవరి 8: మండలంలోని చన్‌గోముల్ గ్రామం నుంచి రేగిడిమామిడిపల్లికి వెళ్లే సీసీరోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గుంత వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు, వాహనదారులు పంచాయతీ అధికారులకు విన్నవించారు. నడిరోడ్డుపై గుంతను పూడ్చే నాథుడే లేరా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతలను పూడ్చాలని వేడుకుంటున్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన మేడ్చల్ నేతలు



మాజీ మంత్రి హరీశ్‌రావుతో మేడ్చల్ నేతలు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8: సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావును బీఆర్ఎస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్‌లు గురువారం మర్యాదపూరకంగా కలిశారు. నగరంలోని హరీశ్‌రావు ఇంటికి వెళ్లి నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. ఉద్యమ కాలం నుంచి హరీశ్ రావు వెంట ఉన్న నేతలు ప్రస్తుత పార్టీ పరిస్థితులపై చర్చించారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8: మేడ్చల్ పట్టణ కిష్టాపూర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

ధ్యానం అలవాటు చేసుకోవాలి



కాళ్లాపూర్‌లో మాట్లాడుతున్న ఆంజనేయరెడ్డి

పరిగి,ఫిబ్రవరి 8: నిత్య జీవితంలో ధ్యానం అలవాటు చేసుకోవాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బి.ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త బాలకృష్ణారెడ్డిలు అన్నారు. పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పరిగి మండలంలోని సయ్యద్‌మల్కాపూర్, జాఫర్‌పల్లి, కాళ్లాపూర్, గూడూరు తదితర గ్రామాల్లో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధ్యానంతో ఆరోగ్యంగా ఉండడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గుండెజబ్బులు, బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులు ధ్యానంతో తగ్గించుకోవచ్చన్నారు. నిత్య జీవితంలో ఎదుర్కొనే అనేక ఒత్తిడిళ్లతో సతమతమ్యే వారికి ధ్యానం ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రతీరోజు ఎవరి వయసు ఎంత ఉంటుందో అన్ని నిమిషాలు ధ్యానం చేయడానికి కేటాయించాలని సూచించారు. ధ్యానం చేయడానికి శాఖాహార జీవితాన్ని గడపాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదకర వ్యాధులు రాకుండా ధ్యానం నివారిస్తుందని తెలిపారు. చిన్నపిల్లలకు ధ్యానం అందించడం ద్వారా చదువుపై ఏకాగ్రతతో పాటు ఆరోగ్యపరమైన లాభాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థసభ్యులు నవీన్, శైలజ, వేణు, శ్రీను, బాబు తదితరులు పాల్గొన్నారు.